E-KABURU

# ఈ-కబురు

E-PAPER

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 20-09-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

## తెలంగాణలో భారత్ ఫ్యూచర్ సిటీ



» అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ నగరం.. దేశ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా నిర్మాణం
» మొదటి దశలో 30 వేల ఎకరాల్లో 9 జోన్లతో ఏర్పాటు
» పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ వెల్లడి
» ప్రపంచ ఆర్థిక సద స్సు అధ్యక్షుడు, న్యూజెర్సీ గవర్నర్, పారిశ్రామికవేత్తలతో చర్చలు

తరువాయి 2లో

తరువాయి 2లో

## ఫిరాయింపులపై స్పీకర్ విచారణ షురూ..
## ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు



» ఈకబురు, హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమావిచారణకు ట్రయల్ మొదలుపెట్టారు. ఈ మేరకు ఇవాళ బీఆర్ఎస్పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు సంజయ్, పోచారం శ్రీనివాస రెడ్డి, తెల్లం వెంకట్ రావు, కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా ఫిర్యాదుదారులైన బీఆర్ఎస్ నాయకులకు కూడా నోటీసులు అందాయి. ఆ నోటీసులలో ఎమ్మెల్యేలు పార్టీ మారారని రుజువు చేసేందుకు మరిన్ని ఆధారాలను తనకు అందజేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.

తరువాయి 2లో

భారతీయులకు పిడుగులాంటి వార్త.. హెచ్1బీ వీసాదరఖాస్తు రుసుం లక్ష డాలర్లు



» 3లో

## రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

» తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి
» పీఏఎఫ్ఐ సదస్సులో పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
» న్యూజెర్సీ గవర్నర్ సహా పలువురు ప్రముఖులతో వరుస సమావేశాలు
» రాష్ట్రంలో రూ.200 కోట్లతో కొత్త డెయిరీ యూనిట్ పెట్టేందుకు ముందుకొచ్చిన గోద్రెజ్



తరువాయి 2లో

## ఎమ్మెల్యేలను దొంగిలించడం పెద్ద నేరం

రాహుల్‌ది రెండు నాల్కల ధోరణి
బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్
రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఎన్నిక నిర్ణయిస్తుంది: కేటీఆర్



» 2లో

హృతిక్ సరసన రష్మిక?

» 5లో



తెలిరోజే ఐఫోన్ 17 తీసుకుందాం

» 4లో




పది పాస్ కాకుండా 'డిగ్రీ' పట్టా ఎలా?.. డిప్యూటీ సీఎంపై మండిపడ్డ ప్రశాంత్ కిశోర్



» 3లో

పదవి గండమా? రాజీనామా?



వివరాలు తెలుసుకొని మూడు వారాల్లో అఫిడవిట్ వేయండి

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి కేసులో పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

తరువాయి 3లో

## ప్రాధాన్య క్రమంలో పనుల ప్రతిపాదనలు పంపండి



» హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి
» క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో..అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచనలు

ఈకబురు, హైదరాబాద్: , వివిధ ప్రభుత్వ శాఖల్లోని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, ప్రధాన పనుల(క్యాపిటల్ వర్క్స్) క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. కమిటీలో సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అత్యవసరమైన ప్రధాన పనులకు ప్రాముఖ్యమివ్వాలని చెప్పారు.

## దొంగతనాన్ని చూసింది.. దొంగల్ని కాపాడింది

» అదీ ఈసీ వాచ్‌మేన్ పాత్ర
» రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు



తరువాయి3లో

పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది



» 3లో

ఎలక్ట్రిక్ బస్సుల గరిష్ఠ వేగం 80 కి.మీ.లకు తగ్గింపు



## నీటి వినియోగ లెక్కల్లేవ్

» శుక్రవారం ఢిల్లీలో జరిగిన పీఏఎఫ్ఐ సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
» గోదావరి, కృష్ణాలో ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వాడుతున్నామో తెలియట్లేదు
» ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
» 'కాళేశ్వరం'పై విచారణను సీబీఐకి ఇస్తే 48 గంటల్లో తేలుస్తామన్న కిషన్‌రెడ్డి ఎక్కడ?
» సరిపడా యూరియా ఇవ్వకుండా రాష్ట్రంపై కేంద్రం కక్ష సాధిస్తోందని ఆరోపణ
» కేసీఆర్, ఎల్ అండ్ టీ వల్లే మెట్రో రైలు అంచనా వ్యయం పెరిగిందన్న సీఎం
» సుప్రీం తీర్పునకు అనుగుణంగా 'స్థానికం'పై ముందుకెళ్తామని వెల్లడి
» కండువాలు కప్పినంత మాత్రాన ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు కాదని వ్యాఖ్య




న్యూఢిల్లీ, ఈకబురు,: కృష్ణా, గోదావరి నదుల్లో ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వినియోగిస్తున్నామన్న లెక్కలు ప్రభుత్వం వద్ద లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాల్లో రాష్ట్రానికి 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నా అందులో ఎంత నీటిని వాడుతున్నామన్న దానిపై స్పష్టత కొరవడిందన్నారు. శుక్రవారం ఢిల్లీలో వివిధ అంశాలపై సీఎం రేవంత్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇందులో భాగంగా నీటి వినియోగ లెక్కల గురించి ఆయన వివరించారు. 'గోదావరిలోని 968 టీఎంసీల నీటి కేటాయింపుల్లో ఎన్ని టీఎంసీల నీటిని రాష్ట్రం వాడుకుంటోందో ఎవరికీ తెలియదు. ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వాడుతున్నదీ.. ఎంత ఆయటక్టుకు నీళ్లిస్తున్నదీ తెలియకుండా గత ప్రభుత్వం అంతా గందరగోళం చేసింది. ఒక ప్రాజెక్టు ఆయకట్టును ఇంకో ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టులో కలిపి చూపించింది. దీంతో ఏ ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టు ఉందో, ఎంత నీటిని వినియోగిస్తున్నామో రాష్ట్రం వద్ద లెక్కల్లేవు. అందుకే ఆ లెక్కలు తయారు చేయాలని అధికారులను ఆదేశించాం. అది పూర్తయితేనే తెలంగాణకు మిగిలిన నీటి వాటా ఎంతో తెలుస్తుంది.

ఆ మిగిలిన నీటి వాటాను వినియోగించుకునేలా తుమ్మిడిహెట్టి వంటి ప్రాజెక్టులను చేపడతాం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణంపై మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. ఇక కృష్ణాలోనూ పరీవాహకం ఆధారంగా 904 టీఎంసీలను కోరుతున్నామని.. అందులో నికర, వరద, మిగులు జలాలన్నీ కలిపి ఉన్నాయని సీఎం వివరించారు.

తరువాయి 2లో

వాషి యో వాషి..

» 5లో




సూపర్ 'ఆరంభం' ఎవరిదో?

» 6లో



# భారతీయులకు పిడుగులాంటి వార్త.. హెచ్1బీ వీసాదరఖాస్తు రుసుం లక్ష డాలర్లు



వాషింగ్టన్: అమెరికా లో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులకు పిడుగులాంటి వార్త. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా పై కీలక నిర్ణయం తీసుకున్నారు. హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఇక మీదట అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కొక్క వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. దీంతో కొత్త హెచ్1బీ వీసా విధానం భారత్‌తో పాటు, చైనాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ప్రతి హెచ్-1బీ వీసాపై ఏటా లక్ష డాలర్లు రుసుం విధించినట్లు యూఎస్ కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని పెద్ద కంపెనీలకు వివరించినట్లు తెలిపారు. "మీరు ఎవరికైనా శిక్షణ ఇవ్వదలుచుకుంటే ఇటీవల మన దేశంలోని గొప్ప యూనివర్సిటీల నుంచి పట్టభద్రులైన మన వారికి ఇవ్వండి. అమెరికన్లకు ట్రైనింగ్ ఇవ్వండి. మన ఉద్యోగాలను కొల్లగొడుతున్న వారిని ఇతర దేశాల నుంచి తీసుకురావడం ఆపండి" అని లుట్నిక్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

ఈ నిర్ణయానికి టెక్నాలజీ రంగం మద్దతు ఇస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వారు చాలా సంతోషిస్తారని తెలిపారు. ట్రంప్ నిర్ణయంపై దిగ్గజ టెక్ కంపెనీలు అయిన యాపిల్, గూగుల్, మెటా ఇంతవరకు స్పందించలేదు.

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బీ వీసా తీసుకొచ్చారు. యూఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్-1బీ వీసా దారుల్లో ఇండియా 71 శాతం వాటా కలిగి ఉండగా, చైనా 11.7 శాతం వాటా కలిగి ఉంది. వీటిని మూడు నుంచి ఆరేళ్ల మధ్య కాలానికి మంజూరు చేస్తారు.

దీంతో ఈ వీసాను ఉపయోగించుకొని ఎంతో మంది విదేశీ నిపుణులు అమెరికాలోకి ప్రవేశించి ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు లాటరీ విధానం ఉంది. తొలుత లాటరీ దరఖాస్తుకు సాధారణ ఛార్జీలు కట్టాల్సి ఉంటుంది. లాటరీలో ఎంపికైతే అదనపు ఛార్జీలు చెల్లించాలి. చాలా సందర్భాల్లో కంపెనీలే వీసా ఛార్జీలను భరిస్తాయి. తాజాగా తీసుకున్న నిర్ణయం కంపెనీలకు పెను భారంగా మారనుంది. అమెరికా ఏటా 85వేల వీసాలను లాటరీ విధానం ద్వారా జారీ చేస్తోంది.

మరోవైపు గోల్డ్‌కార్డును సైతం ట్రంప్ ప్రకటించారు. దీనికి 10 లక్షల డాలర్లుగా నిర్ణయించారు. దీని ద్వారా అమెరికాకు 100 బిలియన్ డాలర్లు సమకూరే అవకాశం ఉంది. పన్నుల తగ్గింపు, అభివృద్ధి ప్రాజెక్టులకు, రుణాల చెల్లింపులకు గోల్డ్‌కార్డు నిధులు వినియోగించనున్నట్లు ట్రంప్ తెలిపారు.

మొదటి పేజి తరువాయి

# పదవీ విరమణా? రాజీనామానా?



ఈ-కబురు, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంకట్రామిరెడ్డి తన అఖిల భారత సర్వీస్‌కు పదవీ విరమణ చేశారా.. లేక రాజీనామా చేశారా.. అన్న వివరాలు లేకుండా పిటిషన్ దాఖలు చేస్తే ఎలా అని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకొని మూడు వారాల్లో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2021, నవంబర్‌లో జరిగిన మండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా మాజీ ఐఏఎస్ వెంట్రామిరెడ్డి ఎన్నికైన విషయం విదితమే. ఈ ఎన్నిక చట్టవిరుద్ధమంటూ జగిత్యాల జిల్లాకు చెందిన జె.శంకర్‌తోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'2007 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి 2021, నవంబర్ 15 వరకు అధికారిగా కొనసాగారు. బీఆర్ఎస్‌లో చేరే ఉద్దేశంతో స్వచ్ఛంద పదవీవిరమణ నోటీసు సమర్పించారు. అయితే ఐఏఎస్ అధికారుల స్వచ్ఛంద పదవీ విరమణ నియమాల మేరకు నోటీసు ఇచ్చిన మూడు నెలల్లో డీవోపీటీ ఆమోదం తప్పనిసరి. కానీ, వెంకట్రామిరెడ్డి ఎటువంటి రాజీనామా చేయలేదని, పదవీ విరమణ పత్రాలు తమకు అందలేదని నిర్ధారించింది.

ప్రభుత్వ అధికారిగా కొనసాగుతున్న వ్యక్తి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం పోటీకి అనర్హుడు. వెంటనే అతన్ని అనర్హుడిగా ప్రకటిస్తూ.. ఎన్నిక రద్దు చేయాలి'అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పూర్తి వివరాలు తెలుసుకొని అదనపు అఫిడవిట్ వేయాలని చెబుతూ విచారణ వాయిదా వేసింది.

# అఫ్గాన్ భవిష్యత్తు
## వారి చేతుల్లోనే చైనా



అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరాన్ని మళ్లీ స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా చైనా స్పందించింది. బాగ్రాంలో (Bagram Air Base) అమెరికా మళ్లీ పాగా వేసే నిర్ణయాన్ని అఫ్గాన్ ప్రజలకు వదిలేయాలని అభిప్రాయపడింది. వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని పేర్కొంది.

''అఫ్గాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని చైనా (China) గౌరవిస్తుంది. అఫ్గాన్ భవిష్యత్తు అక్కడి ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచడం వల్ల మద్దతు లభించదు. ప్రాంతీయ స్థిరత్వం కోసం సంబంధిత పక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నాం'' అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు.

బ్రిటన్ పర్యటనలో భాగంగా ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అనంతరం మాట్లాడిన డొనాల్డ్ ట్రంప్.. అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరంలో మళ్లీ పాగా వేయాలని భావిస్తున్నామని చెప్పారు. ప్రత్యర్థి చైనా అణ్వాయుధ తయారీ కేంద్రాలకు అతి దగ్గరగా ఉంటుందని, కేవలం గంట వ్యవధిలో వెళ్లవచ్చన్నారు. మరోవైపు, అఫ్గాన్ నుంచి తమ బలగాలను ఉపసంహరించుకున్న వెంటనే తాలిబాన్ ప్రభుత్వంతో చైనా దౌత్య సంబంధాలు ఏర్పరచుకుందని, చమురు వెలికితీత, కాపర్ గని పునరుద్ధరణ కోసం పెట్టుబడులు పెట్టిందని అగ్రరాజ్యం చెబుతోంది.

# ఎలక్ట్రిక్ బస్సుల గరిష్ఠ వేగం 80 కి.మీ.లకు తగ్గింపు




ఈ-కబురు,హైదరాబాద్: రహదారి భద్రత నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సుల గరిష్ఠ వేగాన్ని తగ్గించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ బస్సులు దూరప్రాంత ప్రయాణాల్లో గరిష్ఠంగా గంటకు 100 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుండగా.. దీన్ని 80 కి.మీ.లకు పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బస్సుల్లో స్పీడ్ లిమిట్ చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే దూరప్రాంత సర్వీసులతోపాటు సిటీ బస్సులకూ ఈ నిర్ణయాన్ని అమలు చేయనున్నారని సమాచారం. ప్రస్తుతం సంస్థలో మొత్తం 715 ఎలక్ట్రిక్ బస్సులున్నాయి. రానున్న రోజుల్లో వీటి సంఖ్య భారీగా పెరగనుంది. ఒక్క హైదరాబాద్‌లోనే 2 వేల బస్సులు ప్రవేశపెట్టనున్నారు.

# పది పాస్ కాకుండా 'డిగ్రీ' పట్టా ఎలా?..
## డిప్యూటీ సీఎంపై మండిపడ్డ ప్రశాంత్ కిశోర్




హార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అధికార ఎన్డీయే నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. పదో తరగతి పూర్తిచేయని ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి.. డిగ్రీ పట్టా పొందడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన పీకే.. రాష్ట్రంలో కాషాయ పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని, వాళ్లు లాలూ కంటే ఎక్కువ అవినీతిపరులని ఆరోపించారు.

"రాష్ట్రంలో కాషాయ పార్టీ నేతలు.. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ కంటే ఎక్కువ అవినీతిపరులు. నేతల అక్రమాల వల్లే ఆర్జేడీ అధికారం కోల్పోయింది. ఇక ఉప ముఖ్యమంత్రి చౌదరి పేర్లు మార్చడంలో దిట్ట. గతంలో ఓ కేసులో ఆయన జైలుకు వెళ్లారు. కాలిఫోర్నియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ (D-Litt) ఉందని చెబుతుంటారు. కానీ, ఆయన పదో తరగతి ఎప్పుడు పాసయ్యారు? కాలేదు.." అని పీకే ఆరోపించారు. గతంలో ఎన్నికల అఫిడవిట్‌లో పదో తరగతి ఫెయిల్ అయినట్లు పేర్కొన్న ఆయన.. ఆ తర్వాతి ఎన్నికల్లో డిగ్రీ ఉన్నట్లు చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

ఈసీ కీలక నిర్ణయం.. 474 రాజకీయ పార్టీలపై వేటు..

డిప్యూటీ సీఎం గతంలో అనేకసార్లు పేర్లు మార్చుకున్నారని పీకే ఆరోపించారు. రాకేశ్ కుమార్ నుంచి రాకేశ్ కుమార్ మౌర్య, ఆ తర్వాత సామ్రాట్ కుమార్ మౌర్యగా మార్చుకున్న ఆయన.. ఇప్పుడు సామ్రాట్ చౌదరిగా మారిపోయారన్నారు. మరోవైపు, రూ.వందల కోట్ల అక్రమ సంపాదనతో భూములు కొనుగోలు చేసిన అశోక్ చౌదరి వంటి అవినీతి నేతలను ముఖ్యమంత్రి నీతీశ్ తన క్యాబినెట్‌లో నియమించుకున్నారని విమర్శలు గుప్పించారు.

# పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది



ఈ-కబురు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. దసరా పండుగ వేళ ఆర్టీసీ యాభై శాతం టికెట్ ఛార్జీలు పెంచేందుకు సిద్ధపడటాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. 'కేసీఆర్ గ్రామీణ వ్యవస్థను బలంగా చేస్తే, కాంగ్రెస్ తన 22 నెలల పాలనలో కుప్ప కూల్చింది. గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లలో డీజిల్ పోయించేందుకు డబ్బులు లేక మూలన పడేసిన దుస్థితి. బతుకమ్మ పండుగ పూట కూడా వీధి దీపాలు వెలగక చీకటిలో గ్రామాలున్నాయి. రహదారులు, డ్రైనేజీలకు మరమ్మతులు లేవు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేరు, ఎంపీటీసీలు లేరు, స్థానిక సంస్థల ఎన్నికలు లేవు. ఎమ్మెల్యేల ఏసీడీపీ నిధులు విడుదల చేయకుండా అభివృద్ధిని ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, కుట్రపూరితంగా గ్రామ పాలనను నాశనం చేసే సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం. పల్లె వెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలు విపరీతంగా పెంచి సొంతూళ్లకు వెళ్లే వారికి బతుకమ్మ, దసరా పండుగల సంతోషాన్ని లేకుండా చేస్తున్నారు. ప్రజా పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఇదేనా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# ఎకో టూరిజం హబ్‌గా తెలంగాణ



హైదరాబాద్: ప్రకృతి పర్యాటక ప్రదేశాలు అనేకం ఉన్నాయని, రాష్ట్రాన్ని ఎకోటూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆలయాలున్న అటవీ ప్రాంతాలను ఆధ్యాత్మిక-ప్రకృతి పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఎకో టూరిజం స్క్రీనింగ్ కమిటీ సమావేశం శుక్రవారం సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జరిగింది.రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఎకో టూరిజం ప్రాజెక్టుల అమలుపై స్క్రీనింగ్ కమిటీ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఆయాచోట్ల స్థానిక గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం గుర్తులున్నందున ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. అనంతగిరిహిల్స్‌లో రెండో దశలో కారవాన్ క్యాంపింగ్, ఎకో కాటేజీలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ముచ్చర్ల ఎకోపార్క్ నైట్ సఫారీ, డైనోసార్ పార్క్ వంటివి రూపకల్పన చేసినట్టు తెలిపారు. సమావేశంలో అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) సువర్ణ, ఎఫ్‌డీసీ ఎండీ సునీత భగవత్, ఉన్నతాధికారులు ఏలూసింగ్ మేరు, జి.రామలింగంతో పాటు ఆర్థికశాఖ సహా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ ఉద్యోగులకు అండగా ఉంటాం

విధి నిర్వహణలో చనిపోయిన ఆరుగురు దేవాదాయశాఖ ఉద్యోగుల కుటుంబాలకు, రిటైరైన ఉద్యోగులకు వివిధ రకాల ఆర్థిక సహాయాలు, రుణాలకు సంబంధించిన చెక్కులను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అందించారు. దేవాదాయశాఖలో ఉద్యోగులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని ఆమె భరోసానిచ్చారు. శుక్రవారం సచివాలయంలోని తన పేషీలో జరిగిన కార్యక్రమంలో 20 కుటుంబాలకు రూ.1.05 కోట్ల విలువైన చెక్కుల్ని అందించారు

# ఆఫర్ల షి'కారు'



**జీఎస్టీ తగ్గింపుతో కార్ల కోసం క్యూ**
**పండుగ ఆఫర్‌లతో ఆకట్టుకుంటున్న ఆటోమొబైల్స్ సంస్థలు**
**చిన్న కార్లపై రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు తగ్గింపు**
**సెప్టెంబర్ 22 కోసం కొనుగోలుదారుల ఎదురుచూపులు**
**రోజుకు 1,000కి పైగా బుకింగ్‌లు**

వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో పరుగులు తీయనున్నాయి. ఈ నెల 22 నుంచి జీఎస్టీ తగ్గనున్న నేపథ్యంలో మధ్యతరగతి వేతనజీవులు తమ చిరకాల వాహనయోగ కోరికను తీర్చుకొనేందుకు ఆటోమొబైల్ షోరూమ్‌లకు బారులు తీరుతున్నారు. ఒకవైపు జీఎస్టీ తగ్గింపుతోపాటు మరోవైపు దసరా, దీపావళి పర్వదినాలను దృష్టిలో ఉంచుకొని ఆటోమొబైల్ షోరూమ్‌లో వాహనాల అమ్మకాలపైన ఆఫర్లు, రాయితీలు ప్రకటించాయి. దీంతో కొనుగోలుదా రులకు ఈ దసరా ఉత్సవం డబుల్ ధమాకా అయ్యింది. వివిధ రకాల వస్తు సేవలపై జీఎస్టీని తగ్గించనున్నట్టు ప్రధాని ప్రకటించినప్పటి నుంచి గ్రేటర్ హైదరాబాద్‌లో వాహన విక్రయాలు ఉన్నపళంగా తగ్గుముఖం పట్టాయి. అప్పటికప్పుడు కొత్త బండి కొనుగోలు చేయాలని భావించిన వారు తమ ప్రణాళికలను సెప్టెంబర్ 22వ తేదీకి వాయిదా వేశారు. జీఎస్టీ తగ్గింపుపై స్పష్టత రావడంతో ప్రస్తుతం షోరూమ్‌లకు పరుగులు తీస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌లకు సైతం పెద్దఎత్తున డిమాండ్ ఉన్నట్టు ఆటోమొబైల్ డీలర్లు పేర్కొంటున్నారు.

ఆర్టీఏలో సందడే..సందడి

సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతి రోజు సుమారు 1,500 నుంచి 2,000 వరకు కొత్త వాహనాలు నమోదవుతాయి. వాటిలో 400 నుంచి 500 వరకు కార్లు ఉంటే మిగతావి ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే. రవాణా వాహనాల సంఖ్య తక్కువగానే ఉంటుంది. కానీ ఇప్పుడు కార్ల బుకింగ్‌లు అమాంతంగా పెరిగాయి. ఈ నెల 22 నుంచి కొనుగోలు చేసేందుకు ముందస్తు బుకింగ్‌ల కోసం బారులు తీరుతున్నారు. నగరంలో ప్రతి రోజు 1,000కి పైగా బుకింగ్‌లు అవుతున్నట్టు పలువురు డీలర్లు చెప్పారు.

హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అంతటా వాహనాల అమ్మకాలు ఊపందుకున్నాయని బంజారాహిల్స్‌లోని ప్రముఖ కార్ల షోరూమ్‌కు చెందిన ప్రతినిధి ఒకరు తెలిపారు. సుమారు 6 నెలలకు పైగా అమ్మకాల్లో స్తబ్దత నెలకొందని, ప్రస్తుతం జీఎస్టీ తగ్గింపుతో అనూహ్యంగా అమ్మకాలు పెరిగాయని సికింద్రాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన కొండల్‌రెడ్డి తెలిపారు. కార్లతోపాటు ద్విచక్ర వాహనాలకు సైతం గిరాకీ పెరిగింది. సెప్టెంబర్ 22 నుంచే కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. సాధారణ ఉద్యోగ వర్గాల నుంచి మధ్యతరగతి, ఉన్నత ఆదాయ వర్గాల వరకు తమ తాహత్తు మేరకు వాహనాలను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు.

చిన్న కార్లకు పెద్ద డిమాండ్...

జీఎస్టీ తగ్గింపు ప్రభావం హైఎండ్ వాహనాల కంటే చిన్న కార్లపైన ఎక్కువగా ఉంది. రూ.20 లక్షల కంటే తక్కువ ఖరీదైన వాహనాల ధరలు తగ్గనున్నాయి. వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన వాహనాలపైన వాటి ధరలపైన సుమారు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు తగ్గనున్నాయి. ఈ మేరకు క్రెటా, నెక్సాన్, బ్రిజా, పంచ్ వంటి వాహనాల అమ్మకాలు భారీగా పెరగనున్నాయి. కొనుగోలుదార్లు సైతం తమ బడ్జెట్‌కు అనుకూలమైన కేటగిరీకి చెందిన వాహనాలనే ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారు. జీఎస్టీ తగ్గింపుతోపాటు ఆటోమొబైల్ డీలర్లు సుమారు రూ.50,000 నుంచి రూ.80,000 వరకు తగ్గింపు ఆఫర్‌లను అందజేస్తున్నాయి.

దసరాకు కొత్త బండి కష్టమే....

ముందస్తు బుకింగ్‌లు భారీగా పెరిగిన దృష్ట్యా అక్టోబర్ 2వ తేదీ దసరా నాటికి కొనుగోలుదారులందరికీ కొత్తబండి యోగం కష్టమే. ఇప్పటికిప్పుడు బుక్ చేసుకుంటే వాహనం డెలివరీ కావడానికి కనీసం 30 రోజుల నుంచి 45 రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. 'ఆటోమొబైల్ సంస్థలు ప్రతి రోజు సగటున దేశవ్యాప్తంగా 25,000 నుంచి 30,000 కార్లను డెలివరీ చేస్తాయి. ప్రస్తుత బుకింగ్‌ల నేపథ్యంలో రోజుకు 45,000 కంటే ఎక్కువగా డెలివరీ చేయాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌తోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బుకింగ్‌లు భారీగా ఉన్న దృష్ట్యా వినియోగదారులకు వాహనం చేరడానికి కొంత సమయం పట్టొచ్చు'అని తెలంగాణ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంకోటేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుత డిమాండ్ మేరకు నగరంలోని కొందరు ఆటోమొబైల్ డీలర్లు అడ్వాన్స్‌గా ఎక్కువ సంఖ్యలో వాహనాల దిగుమతికి ఆర్డర్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మకాలపైన ఈ ఒత్తిడి ఈ ఏడాది చివరకు ఉండే అవకాశం ఉన్నట్టు డీలర్లు అంచనా వేస్తున్నారు.

# తొలిరోజే ఐఫోన్ 17 తీసుకుందాం



టెక్ దిగ్గజం యాపిల్ తాజాగా ఆవిష్కరించిన ఐఫోన్ 17 శ్రేణిపై దేశీయ ప్రధాన నగరాల్లో అమితాసక్తి ఏర్పడింది. ఇప్పటికే ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి, శుక్రవారం ఉదయం అందిస్తామని యాపిల్ ప్రకటించడంతో.. తెల్లవారుజాము నుంచే ముంబయి, దిల్లీ, బెంగళూరుల్లోని యాపిల్ స్టోర్ల వద్ద అభిమానులు వేచిఉండటం కనిపించింది. కొత్త ఫోన్‌ను తొలిరోజే అందుకోవాలనే ధోరణితో యువత అధికంగా గుమికూడారు. ముంబయి బాంద్రా కుర్లా స్టోర్, దిల్లీ సాకేత్ సిటీవాక్ మాల్, బెంగళూరు నగరాల్లో స్టోర్ల ముందు భారీగా సందడి నెలకొంది. కొన్ని చోట్ల తోపులాటలు, ఘర్షణలు జరిగిన వీడియోలు నెట్‌లో హల్‌చల్ చేశాయి. హైదరాబాద్ వంటి నగరాల్లోనూ విక్రయసంస్థలు సందడిగా ఐఫోన్ 17 ప్రచార కార్యక్రమాలను నిర్వహించాయి. ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రోమ్యాక్స్ మోడళ్ల ప్రారంభ ధరలు వరుసగా రూ.82,900, రూ.1,19,000, రూ.1,34,900, రూ.1,49,900గా ఉన్నాయి. ప్రోమ్యాక్స్ మోడల్ గరిష్ఠ విక్రయ ధర రూ.2,29,900. వీటిపై పలు ఆఫర్లను సంస్థలు ప్రకటించాయి. నెలవారీ కొనుగోలు పథకాలూ ఉన్నాయి.

# భారత రేటింగ్‌ను పెంచిన జపాన్ సంస్థ



భారత దీర్ఘకాలిక సార్వభౌమ రుణ రేటింగ్‌ను 'బీబీబీ' నుంచి 'బీబీబీ+'కు పెంచుతున్నట్లు జపాన్ సంస్థ రేటింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్ అండ్ ఐ) ప్రకటించింది. మన దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ అంచనాను 'స్థిరం'గా కొనసాగించింది. ఈ ఏడాదిలో భారత్ రేటింగ్‌ను పెంచిన మూడో సార్వభౌమ రుణ రేటింగ్ సంస్థగా ఆర్ అండ్ ఐ నిలిచింది.

2025 మేలో మన రేటింగ్‌ను బీబీబీ (తక్కువ) నుంచి 'బీబీబీ'గా ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ డీబీఆర్ మార్చింది. అమెరికాకు చెందిన ఎస్ అండ్ పీ, గత ఆగస్టులో భారత రేటింగ్‌ను బీబీబీ నుంచి బీబీబీ చేసింది. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తున్న భారత్ రేటింగ్ పెంపులో భౌగోళిక సానుకూలతలు, బలమైన దేశీయ గిరాకీ, అనుకూల ప్రభుత్వ విధానాల వంటివి కలిసొస్తున్నాయని ఆర్ అండ్ ఐ తెలిపింది. పన్ను ఆదాయాల్లో వృద్ధి, రాయితీల హేతుబద్ధీకరణ, నిర్వహించదగ్గ స్థాయిలో రుణాలు, అధిక వృద్ధి వంటి అంశాలతో ప్రభుత్వ ద్రవ్య స్థిరీకరణ పురోగతి మెరుగ్గా ఉందని వెల్లడించింది. ఆర్ అండ్ ఐ రేటింగ్ పెంపును ఆర్థిక శాఖ స్వాగతించింది.

# నామినీ నుంచి వారసులకు షేర్ల బదిలీ ఇక సులువు



నామినీ నుంచి చట్టబద్ధ వారసులకు షేర్ల బదిలీ ప్రక్రియను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సరళతరం చేసింది. ప్రస్తుతం చట్టబద్ధ వారసుడు/వారసురాలికి నామినీ నుంచి సెక్యూరిటీల బదిలీ జరిగితే.. కొన్నిసార్లు దీనిని 'ట్రాన్స్‌ఫర్'గా పరిగణించి మూలధన లాభాల పన్ను విధిస్తున్నారు. అయితే ఆదాయపు పన్ను చట్టం1961లోని సెక్షన్ 47(3) ప్రకారం.. ఈ తరహా బదిలీలకు పన్ను మినహాయింపు ఉండాలి. తర్వాత రిఫండ్ క్లెయిము చేసుకోవడానికి నామినీకి అవకాశం ఉన్నా.. ముందుగా పన్ను చెల్లించడం అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దీన్ని పరిష్కరించడం కోసం కొత్త రిపోర్టింగ్ కోడ్ 'టీఎల్‌హెచ్' (ట్రాన్స్‌మిషన్ టు లీగల్ హెయిర్స్)ను ఒక కార్యాచరణ బృందం సిఫారసు చేసింది. తద్వారా ఇటువంటి షేర్లు బదిలీ అయినప్పుడు పన్ను పడకుండా ఉంటుంది. ఈ విషయాన్ని సీబీడీటీ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు సెబీ తెలిపింది. 2026 జనవరి 1 నుంచి అన్ని ఆర్‌టీఏలు, లిస్టెడ్ కంపెనీలు, డిపాజిటరీలు, డిపాజిటరీ పార్టిసిపెంట్లు ఈ తరహా లావాదేవీలను సీబీడీటీకి రిపోర్ట్ చేసే సమయంలో టీఎల్‌హెచ్ కోడ్‌ను వాడాలి.

ఏఐఎఫ్ (ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) వ్యవస్థలో పారదర్శకత ప్రోత్సహించడం కోసం ఏఐఎఫ్‌లు క్రమం తప్పకుండా తమ యూనిట్ల ఎన్‌ఏవీ (నెట్ అసెట్ వేల్యూ)లను డిపాజిటరీ వ్యవస్థలో అప్‌డేట్ చేయాలని సెబీ ప్రతిపాదించింది.



# నష్టాల్లో ముగిసిన చివరి ట్రేడింగ్ సెషన్

భారత స్టాక్ మార్కెట్లు వారం చివరి ట్రేడింగ్ సెషన్‌ను నష్టాలతో ముగించాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అధిక స్థాయిలో లాభాల బుకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ వంటి కీలక రంగాలలో బలహీనత ఈ క్షీణతకు కారణం. బీఎస్ఈ సెన్సెక్స్ 387.73 పాయింట్లు లేదా 0.47 శాతం నష్టపోయి 82,626.23 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 96.55 పాయింట్లు లేదా 0.38 శాతం తగ్గి 25,327.05 వద్ద ముగిసింది.సెన్సెక్స్ కాంపోనెంట్ లలో, అదానీ పోర్ట్స్ , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), భారతీ ఎయిర్ టెల్, ఎన్‌టిపిసి, ఏషియన్ పెయింట్స్ 1.13 శాతం లాభాలను నమోదు చేశాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, టైటాన్ కంపెనీ, మహీంద్రా అండ్ మహీంద్రా 1.52 శాతం నష్టపోయాయి.

విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.04 శాతం, 0.15 శాతం స్వల్ప లాభాలతో ముగిశాయి.

రంగాలపరంగా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.28 శాతం లాభంతో ముగిసింది. నిఫ్టీ మెటల్, ఫార్మా, రియల్టీ సూచీలు లాభాలు పొందాయి. ఎఫ్ఎంసిజి, ఐటి, ఆటో, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు 0.65 శాతం వరకు క్షీణించాయి.మొత్తంగా మార్కెట్ విస్తృతి సానుకూలంగా ఉంది. ఎన్ఎస్ఈలో లిస్ట్ అయిన 3,133 స్టాక్స్ లో 1,601 లాభాలను అందుకోగా 1,427 క్షీణించాయి. 105 మారలేదు. శుక్రవారం సెషన్ ముగిసే సమయానికి, ఎన్ఎస్ఈ-లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.24 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.

# హృతిక్ సరసన రష్మిక?



‘క్రిష్ 4’ చిత్రానికి రష్మిక పచ్చజెండా ఊపినట్లేనా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న ‘క్రిష్’ ఫ్రాంచైజీలో నాల్గో భాగం రాబోతున్న సంగతి తెలిసిందే. హిందీ యాక్షన్ హీరో హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పుడీ సినిమాలో ఆయనకు జోడీగా రష్మికను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు మొదలయ్యాయని.. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది చిత్రీకరణను ప్రారంభిస్తామని ఇటీవలే చిత్ర వర్గాలు తెలిపాయి. మరి 2027లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో రష్మిక సందడి ఉంటుందో లేదో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



## జోరుగా చరణ్ సుకుమార్ కొత్త సినిమా స్క్రిప్టు పనులు





ఓవైపు స్టార్ కథానాయకుల చిత్రాలకు దర్శకత్వం వహిస్తూనే.. మరోవైపు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వైవిధ్యభరితమైన సినిమాల్ని నిర్మిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు సుకుమార్. నిర్మాతగా ఆయన ప్రయాణం మొదలై పది వసంతాలు పూర్తయింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ‘కుమారి 21ఎఫ్’, ‘ఉప్పెన’, ‘విరూపాక్ష’, ‘18పేజెస్’, ‘గాంధీతాత చెట్టు’ లాంటి విజయవంతమైన సినిమాల్నిచ్చిన ఆయన.. ఈ రానున్న రెండేళ్ల కాలంలో మరో ఆరు చిత్రాల్ని తెరపైకి తీసుకు రానున్నారు. వాటిలో రామ్‌చరణ్ - బుచ్చిబాబు సానాల ‘పెద్ది’, నాగచైతన్య - కార్తీక్ దండుల కొత్త సినిమా ఉన్నాయి. సుకుమార్ నిర్మాణ భాగస్వామ్యంలో ముస్తాబవుతున్న ఈ రెండు పాన్ ఇండియా సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇక ‘పెద్ది’ తర్వాత చరణ్‌తో చేయనున్న కొత్త చిత్రానికి సుకుమార్ దర్శకత్వంతో పాటు నిర్మాణ భాగస్వామిగానూ వ్యవహరించనున్నారు. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు ప్రీవిజువలైజేషన్ పనులు చకచకా సాగుతున్నాయని చిత్ర వర్గాలు ప్రకటించాయి. ఇక వీటితో పాటు మరో మూడు సినిమాలు కూడా సెట్స్‌పైకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. వాటి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

# వాషి యో వాషి..




‘మై డియర్ ఓమీ.. నీలాంటి వాడిని నేలకెలా దించాలో నాకు తెలుసు” అంటున్నారు ఓజాస్ గంభీర. మరి వీళ్లిద్దరికి ఉన్న విరోధం ఏంటి.. వీళ్ల పోరులో పై చేయి సాధించింది ఎవరు తెలియాలంటే ఓజీ చూడాల్సిందే. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ తెరకెక్కించిన చిత్రమిది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. ఇది ఈ నెల 25న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక సర్‌ప్రైజ్ బయటకు వదిలారు. “మై డియర్ ఓమీ. ఎగిరెగిరి పడుతున్నావు. నీలాంటి వాడిని ఎలా నేలమీదకి దించాలో నాకు తెలుసు. చిన్నప్పుడు నా గురువు చెప్పిన హైకు చెప్తాను విను. వాషి యో వాషి..” అంటూ పవన్ చెప్పిన ఓ జపనీస్ హైకు ఆకట్టుకుంది. దీన్ని బట్టి సినిమాలో పవన్, ఇమ్రాన్ మధ్య గట్టి యుద్ధమే ఉండబోతుందని అర్థమవుతోంది.

## 45రోజులు.. భారీ పోరాటాలు



కేజీఎఫ్’ విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’. గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. కియారా కథానాయిక. నయనతార, హ్యుమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా తాజాగా ముంబయిలో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. దాదాపు 45రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు తెరకెక్కించినట్లు తెలిసింది. అక్టోబరు తొలి వారం నుంచి బెంగళూరులో మరో కొత్త షెడ్యూల్ ప్రారంభిస్తారని తెలుస్తోంది. నవంబరు చివరి కల్లా మొత్తం చిత్రీకరణ ముగించాలన్న లక్ష్యంతో చిత్ర బృందం ముందుకు సాగుతోంది. ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నాన్న బయోపిక్ చేసే ఆలోచన ఉంది!



తరాలు మారినా తెలుగు నేలపై ఎప్పటికీ వినిపించే పేరు... అక్కినేని నాగేశ్వరరావు. వెండితెరకు రొమాంటిక్ రంగులద్దిన ఘనత ఆయనది. సాంఘిక కథలకి కేరాఫ్‌గా నిలుస్తూ... హుషారైన స్టెప్పులతో తెలుగు సినిమాని పరుగులు పెట్టించారు. ఆయన ప్రభావం నటుడిగానే కాదు... అన్నపూర్ణ స్టూడియోస్‌ని స్థాపించి మద్రాస్‌లో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమని హైదరాబాద్‌కి తీసుకు రావడంలోనూ కీలక పాత్ర పోషించారు. శనివారం ఏఎన్నార్ 101వ జయంతి. ఈ సందర్భంగా ఆయన వారసత్వాన్ని ఘనంగా కొనసాగిస్తున్న కుమారుడు, ప్రముఖ కథానాయకుడు అక్కినేని నాగార్జునతో ‘ఈనాడు సినిమా’ ప్రత్యేకంగా ముచ్చటించింది.

**అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణ దశలో ఉన్నప్పటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రహదారులు కూడా లేని ఈ ప్రాంతంలో స్టూడియోని నిర్మిస్తున్న ఆ రోజుల్లో మీ ఆలోచనలు ఎలా ఉండేవి?**

స్టూడియో ప్రారంభించినప్పుడు నేను చిత్ర పరిశ్రమలోకే రాలేదు. మద్రాస్ నుంచి తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కి రావాలనే విషయంలో నాన్న చాలా పట్టుదలతో ఉండేవారు. ఆ పట్టుదలే స్టూడియో నిర్మాణానికి నాంది పలికింది. క్రమంగా ఆ పట్టుదల ఆయన దగ్గర్నుంచి నాకూ వచ్చింది. అందుకే ‘శివ’, ‘గీతాంజలి’ అయిపోగానే నేను హైదరాబాద్‌లోనే నా సినిమాల చిత్రీకరణలు చేస్తానని చెప్పేవాణ్ని. అప్పట్లో ఇక్కడ ఏమీ ఉండేది కాదు. జూనియర్ ఆర్టిస్టులు మినహా అందరినీ చెన్నై నుంచే తీసుకు రావల్సి వచ్చేది. నిర్మాతలకి అది భారం అవుతుండడంతో, నేను తీసుకోవల్సిన డబ్బు కూడా తక్కువే తీసుకునేవాణ్ని. నాన్న కూడా అంతే.

**చిత్ర పరిశ్రమ గురించి ఆయన మీతో ఎలాంటి విషయాల్ని పంచుకునేవారు?**

చిత్ర పరిశ్రమ నుంచే నేను పైకొచ్చాను. నాకు ఇంత పేరొచ్చిందంటే కారణం సినిమానే. నాకు ఇంత ఇచ్చిన సినిమాకి, సమాజానికి నేను తిరిగి ఇవ్వాల్సిందే అనేవారు. నువ్వు హీరోవి అయ్యావన్నా కూడా నాకు పరిశ్రమ ఇవ్వడంతోనే కదా అని స్పష్టంగా చెప్పేవారు. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్న కన్న కల. ఆయన స్థాపించిన ఈ స్టూడియో ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో సినీ రంగానికి సేవలందిస్తోంది. డాల్బీ, వర్చువల్ ప్రొడక్షన్, మోషన్ కేప్చర్ సాంకేతికత... ఇలా అన్నీ ఉన్నాయి. వీటన్నిటికితోడు అన్నపూర్ణ కాలేజ్. ఏ ప్రొడక్షన్ సంస్థకి వెళ్లినా ఇక్కడ చదువుకుని వెళ్లిన సాంకేతిక నిపుణులు కనిపిస్తూనే ఉంటారు.

**స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రాజెక్టులేమైనా ప్రకటించనున్నారా?**

ఇక నుంచి వరుసగా సినిమాలు రాబోతున్నాయి. నా వందో సినిమాని త్వరలోనే మొదలు పెడతాం. అఖిల్ నటిస్తున్న ‘లెనిన్’ చిత్రీకరణ జరుగుతోంది. ‘రంభ ఊర్వశి మేనక’ అనే సినిమా ఒకటి ఉంది. ఈమధ్యే అల్లరి నరేశ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని మొదలుపెట్టాం. వీటితోపాటు కొత్త నటులు, దర్శకుడితో మరో సినిమా చేయబోతున్నాం. వచ్చే ఏడాది అన్నపూర్ణ సంస్థ నుంచి నాలుగైదు సినిమాలు వస్తాయి.

**ఏఎన్నార్ ఉన్నప్పుడు ఆయన పుట్టిన రోజున ఇంట్లో సందడి ఎలా ఉండేది?**

ఆ రోజు సాయంత్రం వరకూ మాకు దొరికేవారే కాదు నాన్న. ఉదయాన్నే అభిమానులతో ఇల్లు నిండిపోయేది. వాళ్లందరినీ కలవడానికే ఆయనకి సమయం సరిపోయేది కాదు. ఆ తర్వాత తన స్నేహితుల్ని కలుసుకునేవారు. మధ్యాహ్నం కొద్దిసేపు పడుకుని సాయంత్రం వేళ మాకు సమయం కేటాయించేవారు. ఆ రోజు రాత్రి కుటుంబ సభ్యులందరూ నాన్న సమక్షంలో కలిసి భోజనం చేసేవాళ్లం. నాన్న పుట్టినరోజు అంటే మా అందరికీ ఒక పండుగ. గతేడాది ఏఎన్నార్ శతజయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించాం. ఇది అన్నపూర్ణ స్టూడియోస్‌కి స్వర్ణోత్సవ ఏడాది. గత రెండేళ్లుగా నాన్నగారి జ్ఞాపకాలే వెంటాడుతున్నాయి. స్టూడియోలో నాన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాక చాలా తృప్తిగా ఉంది. ఆయన ఇక్కడ ఉన్నట్టే అనిపిస్తోంది.

**ఏఎన్నార్ బయోపిక్ సినిమా ప్రయత్నాలేమైనా జరుగుతున్నాయా?**

నాన్న బయోపిక్ చేసే ఆలోచన ఉంది. ఎవరు రాస్తే బాగుంటుంది, అది ఎంత ఆసక్తికరంగా తీయాలనే విషయాలపై చర్చలు జరుగుతున్నాయి. అన్నీ కొలిక్కి వచ్చాక ఆ వివరాల్ని చెబుతా.

**ఏఎన్నార్ ఉన్నప్పుడు స్టూడియోకీ, ఇప్పుడు స్టూడియోకీ మీరు గమనించిన ఓ మార్పు ఏమిటంటే ఏం చెబుతారు?**

నాన్న వస్తున్నారంటే స్టూడియో లోపల హడావుడి ఉండేది. ఎక్కడైనా పరిశుభ్రంగా లేకపోతే మాపై కోప్పడేవారు. అమ్మ కూడా స్టూడియోని ఇంటిలానే చూసుకునేది. స్టూడియోకి అమ్మ పేరు పెట్టాలనే నిర్ణయం నాన్నదే. పండగలొస్తే స్టూడియోలో అందరికీ స్వయంగా భోజనాలు చేసి వడ్డించేవారు. కొత్తతరం చైతన్య, అఖిల్, సుప్రియ... వీళ్లంతా స్టూడియోలో అత్యాధునిక సాంకేతికత ఏర్పాటుపై సలహాలు ఇస్తుంటారు.

# 'సూపర్' ఆరంభం ఎవరిదో?



దుబాయ్: ఆసియా కప్‌లో గ్రూప్ దశకు శుక్రవారం తెరపడగా.. తర్వాతి రోజే సూపర్-4 దశ మొదలు కానుంది. గ్రూప్-బి నుంచి సూపర్-4 బెర్తులు దక్కించుకున్న శ్రీలంక, బంగ్లాదేశ్ శనివారం తొలి పోరులో తలపడనున్నాయి. లంక 3 విజయాలతో ముందంజ వేయగా.. బంగ్లాదేశ్ రెండు గెలుపులతో సూపర్-4 బెర్తును దక్కించుకుంది. గ్రూప్ దశలో ముఖాముఖి మ్యాచ్‌లో బంగ్లాపై 6 వికెట్ల తేడాతో లంక సునాయాసంగా విజయం సాధించింది.

బంగ్లాదేశ్ × శ్రీలంక

వేదిక: దుబాయ్, రా: 8.00

# క్వార్టర్స్‌లో సింధు



జైపుర్: ప్రొ కబడ్డీ సీజన్-12లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత తెలుగు టైటాన్స్ గెలుపు బాట పట్టింది. శుక్రవారం 43-29తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన టైటాన్స్.. విరామ సమయానికి 22-10తో ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో తమిళ్ తలైవాస్ పుంజుకుంది. కానీ టైటాన్స్ తగ్గలేదు. అటాకింగ్ గేమ్‌ను కొనసాగించిన ఆ జట్టు పాయింట్ల మధ్య అంతరాన్ని కొనసాగిస్తూ ఘన విజయాన్ని అందుకుంది. విజయ్ మలిక్ (10), భరత్ (8) టైటాన్స్‌ను గెలిపించారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు 30-34తో హరియాణా స్టీలర్స్ చేతిలో ఓడింది. 19-10తో బ్రేక్‌కు వెళ్లిన హరియాణా అదే దూకుడును ఆఖరిదాకా కొనసాగించి విజయాన్ని అందుకుంది. వినయ్ (13), శివమ్ (8) హరియాణా తరఫున మెరిశారు.

# భారత్ అజేయంగా...





**ఒమన్‌పై 21 పరుగులతో గెలుపు**

**పోరాడి ఓడిన కూన**

**సామ్సన్ అర్ధ సెంచరీ**

**రేపు పాక్‌తో టీమిండియా పోరు**

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీలో లీగ్ దశను భారత్ అజేయంగా ముగించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలిసారి తమతో తలపడిన చిన్న జట్టు ఒమన్‌పై సునాయాస విజయాన్ని అందుకుంది. బ్యాటర్ల పట్టుదలతో ఒమన్ కొంత పోరాడగలిగినా... టీమిండియా ముందు అది సరిపోలేదు. శుక్రవారం జరిగిన ఈ గ్రూప్ 'ఎ' పోరులో భారత్ 21 పరుగులతో గెలుపొందింది.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. సంజు సామ్సన్ (45 బంతుల్లో 56; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... అభిషేక్ శర్మ (15 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (18 బంతుల్లో 29; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఒమన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 167 పరుగులు చేసింది.

ఆమిర్ కలీమ్ (46 బంతుల్లో 64; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), హమ్మద్ మీర్జా (33 బంతుల్లో 51; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టోర్నీలో నేటి నుంచి సూపర్-4 దశ పోటీలు ప్రారంభం అవుతున్నాయి. తొలి పోరులో శ్రీలంకతో బంగ్లాదేశ్ తలపడనుండగా ... ఆదివారం పాకిస్తాన్‌ను భారత్ ఎదుర్కొంటుంది.

**రాణించిన అభిషేక్, తిలక్...**

శుబ్‌మన్ గిల్ (5) త్వరగానే వెనుదిరిగినా... అభిషేక్ మరోసారి తనదైన రీతిలో దూకుడుగా ఆడుతూ శుభారంభం అందించాడు. షకీల్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను నదీమ్ ఓవర్లో మరో మూడు ఫోర్లు బాదాడు. సామ్సన్ కూడా కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో భారత్ 60 పరుగులు చేసింది. అయితే రామనంది వేసిన ఓవర్లో ముందు అభిషేక్ అవుట్ కాగా... రెండు బంతుల తర్వాత దురదృష్టవశాత్తూ హార్దిక్ పాండ్యా (1) రనౌటయ్యాడు.

సామ్సన్ కొట్టిన షాట్‌కు బంతి బౌలర్ చేతికి తాకుతూ స్టంప్స్‌ను పడగొట్టడంతో పాండ్యా వెనుదిరగాల్సి వచ్చింది. ఒకదశలో నాలుగు బంతుల వ్యవధిలో 2 ఫోర్లు, సిక్స్ బాదిన అక్షర్‌ను వెంటనే వెనక్కి పంపడంతో ఒమన్‌సఫలమైంది. శివమ్ దూబే (5) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోగా, తన సహజశైలికి భిన్నంగా ఆడిన సామ్సన్ 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

మరో వైపు క్రీజ్‌లో ఉన్నంత సేపు తిలక్ ధాటిని ప్రదర్శించాడు. అయితే వరుసగా వికెట్లు పడుతూ ప్రధాన బ్యాటర్లంతా వెనుదిరిగినా కూడా ఇతరులకు అవకాశం ఇచ్చేందుకు కెప్టెన్ సూర్యకుమార్ మాత్రం చివరి వరకు బ్యాటింగ్‌కు రాలేదు!

**కలీమ్, మీర్జా అర్ధసెంచరీలు...**

భారీ లక్ష్య ఛేదనలో ఒమన్‌కు సరైన ఆరంభం దక్కింది. ఓపెనర్లు జతీందర్, కలీమ్ జాగ్రత్తగా ఆడి తొలి 6 ఓవర్లలో 44 పరుగులు రాబట్టారు. ఎట్టకేలకు తొలి వికెట్‌కు 52 బంతుల్లో 56 పరుగుల భాగస్వామ్యం తర్వాత కుల్దీప్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత కూడా భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవడంలో ఒమన్ సఫలమైంది.

ఈ క్రమంలో 38 బంతుల్లో కలీమ్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఒమన్ బ్యాటర్లు మరింత దూకుడుగా ఆడారు. కలీమ్‌కు తోడు మీర్జా కూడా ధాటిని ప్రదర్శించాడు. 55 బంతుల్లోనే వీరిద్దరు 93 పరుగులు జత చేయడం విశేషం. 30 బంతుల్లో మీర్జా అర్ధ సెంచరీ సాధించగా... ఆ తర్వాత చేయాల్సిన రన్‌రేట్ పెరిగిపోయి ఒత్తిడిలో ఒమన్ ఓటమి దిశగా పయనించింది.

1 అంతర్జాతీయ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అర్ష్ దీప్ సింగ్ గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఇప్పటి వరకు అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 25 మంది బౌలర్లు 100 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ జాబితాలో రషీద్ ఖాన్ (173 వికెట్లు) 'టాప్'లో ఉన్నాడు.

**స్కోరు వివరాలు:**

**భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) శుక్లా (బి) రామనంది 38; గిల్ (బి) ఫైసల్ 5; సామ్సన్ (సి) బిష్త్ (బి) ఫైసల్ 56; పాండ్యా (రనౌట్) 1; అక్షర్ (సి) శుక్లా (బి) కలీమ్ 26; దూబే (సి) జతీందర్ (బి) కలీమ్ 5; తిలక్ (సి) జిక్రియా (బి) రామనంది 29; హర్షిత్ (నాటౌట్) 13; అర్ష్ దీప్ (రనౌట్) 1; కుల్దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 188. వికెట్ల పతనం: 1–6, 2–72, 3–73, 4–118, 5–130, 6–171, 7–176, 8–179. బౌలింగ్: షకీల్ 3–0–33–0, ఫైసల్ 4–1–23–2, నదీమ్ 1–0–19–0, రామనంది 4–0–32–2, శ్రీవాస్తవ 2–0–23–0, జిక్రియా 3–0–23–0, కలీమ్ 3–0–31–2.**

**ఒమన్ ఇన్నింగ్స్: జతీందర్ (బి) కుల్దీప్ 32; కలీమ్ (సి) పాండ్యా (బి) హర్షిత్ 64; హమ్మద్ (సి) (సబ్) రింకూ (బి) పాండ్యా 51; జిక్రియా (నాటౌట్) 0; శుక్లా (సి) (సబ్) రింకూ (బి) అర్ష్ దీప్ 1; రామనంది (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 167. వికెట్ల పతనం: 1–56, 2–149, 3–154, 4–155. బౌలింగ్: పాండ్యా 4–0–26–1, అర్ష్ దీప్ 4–0–37–1, హర్షిత్ 3–0–25–1, కుల్దీప్ 3–0–23–1, అక్షర్ 1–0–4–0, దూబే 3–0 –31–0, తిలక్ 1–0–8–0, అభిషేక్ 1–0–12–0.**

## లైలస్‌దే 200 మీటర్ల పసిడి



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో స్వర్ణం చేజార్చుకున్న అమెరికా స్టార్ నోవా లైల్స్.. 200 మీటర్లలో ఆ లోటు తీర్చుకున్నాడు. ఈ రేసును 19.52 సెకన్లలో పూర్తి చేసి పసిడి పట్టేశాడు. కెన్నిత్ బెడ్నరెక్ (అమెరికా, 19.58 సె) రజతం గెలిచాడు. బ్రయాన్ లెవీల్ (జమైకా, 19.64 సె) కాంస్యం నెగ్గాడు. పతకం సాధిస్తాడన్న అంచనాలు ఉన్న ఆస్ట్రేలియా అథ్లెట్ గ్వాట్ గ్వాట్ సెమీస్‌లోనే ఇంటిముఖం పట్టాడు. వరుసగా నాలుగో ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణంతో దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్‌ను లైల్స్ సమం చేశాడు. మహిళల 200 మీటర్ల టైటిల్‌ను మెలిసా జెఫర్సన్ (అమెరికా, 21.68 సె) సొంతం చేసుకుంది. అమీ హంట్ (బ్రిటన్, 22.14 సె)కు రజతం దక్కగా.. స్వర్ణానికి ఫేవరెట్ షెరికా జాక్సన్ (జమైకా, 22.18 సె) కాంస్యంతో సరిపెట్టుకుంది. 100 మీటర్లలో పసిడి గెలిచిన మెలిసా జెఫర్సన్ 'డబుల్' సాధించింది.



అనర్హతకు గురై..: పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో రాయ్ బెంజమిన్ నాటకీయ పరిణామాల మధ్య పసిడి గెలుచుకున్నాడు. మొదట అతడు 46.52 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. రేసును పూర్తి చేసే క్రమంలో బెంజమిన్ చివరి హర్డిల్‌ను తాకడంతో అది పడిపోయింది. ఆ హర్డిల్ కూలేటప్పుడు పక్కనే ఉన్న మరో హర్డిల్ కూడా కదలింది. దీంతో ఆ లేన్‌లో పరుగెత్తిన నైజీరియన్ అథ్లెట్‌కు ఇబ్బంది కలిగించాడనే కారణంతో బెంజమిన్‌పై తాత్కాలిక అనర్హత వేటు పడింది. దీనిపై అతడు అప్పీల్ చేసుకున్నాడు. హర్డిల్ పడడం వల్ల పక్కన ఉన్న అథ్లెట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదని రూఢీ చేసుకున్న అధికారులు.. బెంజమిన్‌ను విజేతగా ప్రకటించారు. ఈ రేసులో బ్రెజిల్ కెరటం అలిసన్ సాంటోస్ (46.84 సె) రజతం నెగ్గగా.. సాంబా (ఖతార్, 47.06 సె) కాంస్యం సాధించాడు.

# ప్రదర్శన బాగున్నా...పతకం తెస్తేనే మజా!



**అప్పట్లో గాయంతో కష్టాలు**

**ఊర్లో అప్పులు–తిప్పలు**

**ఇప్పుడు... మా పల్లె వెలుగులోకి వచ్చింది**

**భారత జావెలియన్ త్రోయర్ సచిన్ యాదవ్ వ్యాఖ్య**

న్యూఢిల్లీ: భారత కొత్త జావెలియన్ త్రో సంచలనం సచిన్ యాదవ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆకట్టుకున్నాడు. పాల్గొన్న తొలి ప్రపంచ ఈవెంట్‌లోనే తన ప్రదర్శనతో దిగ్గజాలు నీరజ్ చోప్రా, జూలియన్ వెబర్‌లను అధిగమించడం మంచి అనుభూతినిచ్చినప్పటికీ కాంస్యం చేజారడం తీవ్ర నిరుత్సాహపరిచిందని అన్నాడు. గురువారం జరిగిన పోటీల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 25 ఏళ్ల సచిన్ ఈటెను 86.27 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు.

కాంస్య విజేత కుర్టిస్ థామ్సన్ (అమెరికా; 86.67 మీటర్లు)కు కేవలం 40 సెంటిమీటర్ల దూరంతో పతకం అవకాశాన్ని కోల్పోయాడు. అయితే 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న సచిన్... రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా (84.03 మీటర్లు), ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 82.75 మీటర్లు), టోక్యో డైమండ్ లీగ్ చాంప్ వెబెర్ (జర్మనీ; 86.11 మీటర్లు) లాంటి హేమాహేమీలను అధిగమించడం విశేషం. ఈ సందర్భంగా పలు అంశాలపై సచిన్ వెలుబుచ్చిన అభిప్రాయాలు అతని మాటల్లోనే...

**ఘనంగానే ఆరంభించా**

ప్రారంభ త్రో బాగా మురిపించింది. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించాయి. నా శరీర స్పందన, ఆటతీరు కూడా ఉత్సాహపరిచింది. తొలి త్రో వెళ్లిన దూరం, నేల తాకిన చోటు చూశాక పతకం గెలుస్తాననే ధీమా వచ్చింది. మిగతా ప్రయత్నాల్లో ఒక్కసారి అయిన 87 మీటర్ల దూరం ఈటెను విసురుతాననే నమ్మకం కలిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ అథ్లెట్లతో పోటీపడుతున్న నాకు సహజంగానే తదుపరి ప్రదర్శన మించి ఉంటుందనే భావించాను. నా శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ మిగతా ఐదు ప్రయత్నాల్లో ఆరంభ త్రోను మెరుగుపర్చుకోకపోవడం వల్లే ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం కోల్పోయాను.

**నీరజ్ 2 పతకాలు ఖాయమన్నాడు**

సీనియర్ సహచరుడు, స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రాతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉన్నాను. ఫైనల్ ఈవెంట్ జరుగుతున్న సమయంలోనూ మేమిద్దరం ముచ్చటించుకున్నాం. నా తొలి త్రో చూసిన వెంటనే చోప్రా నాతో ఈ ఈవెంట్‌లో దేశానికి రెండు పతకాలు ఖాయమయ్యాయన్నాడు. అతను వెన్నెముక సమస్యతో బాధపడుతున్నప్పటికీ మంచి ప్రదర్శన ఇస్తాడనే అనుకున్నాను. కానీ నీరజ్... ప్రదర్శనలో నా కంటే వెనుకబడిపోవడం చాలా బాధనిపించింది. టోక్యో ఒలింపిక్స్ నుంచి పోడియంలో ఉంటున్న అతను చివరకు ఇక్కడ పతకానికి దూరమవడం నా బాధను రెట్టింపు చేసింది.

**ఆటలు, అథ్లెట్లు ఎరుగరు**

నా ప్రదర్శనతో మా గ్రామంలో (భాగ్‌పట్ జిల్లాలోని ఖేరా) ఎక్కడలేని హడావుడి మొదలైంది. కొందరు జర్నలిస్టులు మా తల్లిదండ్రులతో మాట్లాడారంట. ఆటలు, అథ్లెట్లు, పతకాలంటే వాళ్లకి అస్సలు తెలినే తెలియదు. వాళ్లకు తెలిసిందల్లా తమ కుమారుడికి మంచి ఉద్యోగం, చక్కని జీవితం లభిస్తే చాలనుకునే అమాయకులు. ముఖ్యంగా నన్ను ఓ ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్నారు. 2023లో ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖలో ఉద్యోగం దొరకడంతోనే వారి ఆనందానికి హద్దుల్లేవు. అలాంటిది ఇప్పుడు జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు వచ్చి తమని ప్రముఖంగా ఫొటోలు తీసారని నా తల్లి గొప్పగా చెప్పింది.

**నా గాయంతో అప్పులపాలయ్యాం**

నిజం చెప్పాలంటే నాకు అసలు నాణ్యమైన కోచ్ లేడు. మరో జావెలిన్ త్రోయర్ సందీప్ యాదవ్ నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాడు. అతనే గతేడాది నాకు పారాలింపిక్ స్వర్ణ విజేతలు సుమిత్, నవ్‌దీప్‌ల కోచ్ నవల్ సింగ్‌కు పరిచయం చేశాడు. ఇక కెరీర్ తొలినాళ్లలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. 2021లో నా భుజానికి అయిన గాయంతో మా నాన్న చాలా ఖర్చు చేశాడు. తెలిసిన వాళ్లు, తెలియని వాళ్ల దగ్గర అప్పులు చేసి నన్ను బాగు చేశాడు. మళ్లీ ఈ ఏడాది ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిచినప్పుడు కూడా చీలమండ గాయంతో ఇబ్బందిపడ్డాను. అయితే అప్పటికీ ఇప్పటికీ ఎంతో మారింది. ఇప్పుడు నేను 'టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్)లో ఉన్నాను. వ్యక్తిగత స్పాన్సర్‌షిప్ కూడా లభించింది. కాబట్టి ఇప్పుడు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదు. పునరావాస శిబిరంలోనే గాయానికి చికిత్స తీసుకుని వెంటనే మెరుగయ్యాను.

**సచిన్‌కు చీఫ్ కోచ్ కితాబు**

క్రీడాశాఖ ప్రోత్సాహకాలతో సచిన్ యాదవ్‌కు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో దిగ్గజ రష్యన్ కోచ్ సెర్గెయ్ మకరొవ్ శిక్షణ జతయ్యింది. సచిన్ టాలెంట్‌ను గుర్తించిన ఆయన వెంటనే చిన్నచిన్న తప్పు ఒప్పులను సరిచేశారు. మెలకువలు నేర్పించారు. ట్రెయినింగ్ సెషన్స్‌లో 90 మీటర్ల దూరం కూడా ఈటెను విసిరాడని, అతను భారత జావెలిన్ త్రోలో నీరజ్‌కు ధీటుగా పతకాలు సాధిస్తాడని చీఫ్ కోచ్ మకరొవ్ కితాబిచ్చారు.

**ఇలా ముగిస్తానని అనుకోలేదు: నీరజ్**

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచి నిరాశ పరిచిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... విరామం అనంతరం బలంగా తిరిగి వస్తానని ధీమా వ్యక్తం చేశాడు. టోక్యో వేదికగా జరిగిన ఫైనల్లో జావెలిన్‌ను 84.03 మీటర్ల దూరం విసిరిన డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా... ఐదో త్రో అనంతరం ఎలిమినేట్ అయ్యాడు. ఇదే పోటీలో భారత్‌కు చెందిన మరో త్రోయర్ సచిన్ యాదవ్ జావెలిన్‌ను 86.27 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు.

సచిన్‌కు ఇదే వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. 'సీజన్‌ను ఇలా ముగిస్తానని అనుకోలేదు. దేశం తరఫున అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే ఉద్దేశంతోనే టోక్యో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టా. కానీ అది సాధ్యపడలేదు. అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మరింత బలంగా తిరిగివస్తా.

సచిన్ యాదవ్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం ఆనందంగా ఉంది. అతడు త్రుటిలో పతకం కోల్పోయాడు' అని నీరజ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. ఈ సందర్భంగా పతక విజేతలకు నీరజ్ అభినందనలు తెలిపాడు. 27 ఏళ్ల నీరజ్ చోప్రా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం... 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించాడు.

# సెమీస్‌లో సాత్విక్–చిరాగ్



షెన్‌జెన్: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ ఆ దిశగా మరో అడుగు వేసింది. చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–14, 21–14తో రెన్ జియాంగ్ యు–జియె హావోనన్ (చైనా) జోడీపై విజయం సాధించింది.

38 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ భారత జోడీ ఆధిపత్యం కనబరిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ ఆరోన్ చియా–సో వుయ్ యిక్ (మలేసియా)తో సాత్విక్–చిరాగ్ జంట తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్–చిరాగ్ ద్వయం 4–11తో వెనుకంజలో ఉంది.

**సింధు ఎనిమిదో'సారీ'**

మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు పోరాటం ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు 14–21, 13–21తో పరాజయం పాలైంది.

ఆన్ సె యంగ్‌తో ఇప్పటి వరకు ఆడిన ఎనిమిదిసార్లూ సింధు ఓడిపోవడం గమనార్హం. ఈ కొరియా స్టార్‌తో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో సింధు ఒక్క గేమ్ మాత్రమే గెలవగలిగింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సింధుకు 6,875 డాలర్ల (రూ. 6 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 6050 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.